
వంశధార తీరం.. భక్తజన సంద్రం



ఎల్.ఎన్.పేట: నదీతీరంలో సైకత శివ లింగానికి పూజలు



- వైభవంగా చక్రతీర్థ స్నానాలు
- మార్మోగిన శివనామ స్మరణ
- ఈ ఏడాది పెరిగిన భక్తుల తాకిడి

ఎల్.ఎన్.పేట: దక్షిణ కాశీగా పేరొంది, భక్తులతో నిత్యం పూజలందుకుంటున్న శ్రీముఖలింగేశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలు మండలంలోని మిరియాపల్లి వద్ద వంశధార నది పక్షితీర్థం రేవులో భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో నదీ తీరం జనసంద్రంగా మారిపోయింది. శివనామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ప్రధాన ఆలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను శుక్రవారం మధ్యాహ్నం పాడ్యమి పుణ్య ఘడియల్లో నంది వాహనంపై ఉత్తర దిశలో వంశధార తీరానికి తీసుకొచ్చారు. మిరియాపల్లి గ్రామానికి చెందిన నాయుడు (లుకలాపు) కుటుంబీకులు అప్పటికే ఏర్పాటు చేసిన పచ్చని పందిరిలో పార్వతీ సమేతుడైన శివుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అనంతరం చక్రతీర్థ స్నానాలు చేయించారు. మిరియాపల్లి గ్రామానికి చెందిన ఆడపడుచుగా భావించిన నాయుడు కుటుంబీకులు పార్వతీదేవికి చేనేత వస్త్రాలను బహూకరించారు. చక్రతీర్థ స్నానాలు ముగిసిన తర్వాత శివ పార్వతుల విగ్రహాలను ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి తీసుకెళ్లారు. ముఖలింగేశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలను పూర్వీకుల నుంచి ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి గ్రామానికి చెందిన లుకలాపు కుటుంబీకులే నిర్వహించడం ఆచారంగా వస్తోంది.

సారవకోటలో...

సారవకోట మండల కేంద్రంలోని మండలాధీశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అశ్వ వాహనంపై గ్రామంలో శోభ యాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక శివరామపాత్రుని కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు.



ఎల్.ఎన్.పేట: వంశధార నదీతీరంలో భక్తుల వంటావార్పు



సరుబుజ్జిలి: స్వామివారికి చక్రతీర్థస్నానాలు చేయిస్తున్న భక్తులు

నరసన్నపేటలో...

నరసన్నపేట మండలంలోని లుకలాం వద్ద వంశధార తీరంలో శుక్రవారం వైభవంగా ఉమాకామేశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలు జరిగాయి. ప్రతీఏటా కన్నేపల్లి వంశీకులు, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ వంశపారపర్య అర్చకులు నగరంపల్లి సత్యనారాయణశర్మ, సుబ్రహ్మణ్య శర్మ, సతీష్ కుమార్ శర్మ, ధర్మకర్తలు కేవీఎస్ఎస్ మూర్తి, కేవీఎల్ ప్రసాద్, కేవీ రామారావు, ఈవో టి.మాధవి, లుకలాం సర్పంచ్ తవిటినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింతల వెంకటరావు, మాజీ సర్పంచ్ చింతల సత్యం తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో...

సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామ ఉమాకామేశ్వర స్వామివారి ఆలయ చక్రతీర్థస్నానాలు శుక్రవారం వంశధార నదిలో నిర్వహించారు.



ఎల్.ఎన్.పేట: స్నానాలకు వచ్చి ఇసుక తిన్నెలపై సేదతీరుతున్న భక్తులు



పాతపట్నం: మహేంద్రతనయ నదిలో నీలకంఠేశ్వరునికి చక్రతీర్థ స్నానాలు చేస్తున్న దృశ్యం

ఆలయ అర్చకులు గంగవరపు వాసుదేశ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ నదీతీర ప్రాంతానికి తరలించారు. అనంతరం స్వామివారికి చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. గ్రామంలో స్వామివారిని ఊరేగించారు.

పాతపట్నంలో...

పాతపట్నం మండల కేంద్రానికి పక్కనున్న మహేంద్రతనయ నదిఒడ్డున శుక్రవారం నీలకంఠేశ్వర, కేదారీశ్వర స్వాముల చక్రతీర్థ స్నానాలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐ బి.లావణ్య, ఈవో టి.వాసుదేవరావులు తగిన చర్యలు తీసుకున్నారు. అంతకుముందు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

హిరమండలంలో...

మేజర్ పంచాయతీ హిరమండలంలోని చిన్నకోరాడలో వెలసివున్న స్వయంభూ ఉమారుద్ర కోటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వైభవంగా చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్న సంతార్పన కార్యక్రమం జరిపారు.

కొత్తూరులో...

కొత్తూరు మండలంలోని కుంటిభద్ర గ్రామ సమీప వంశధార నదిలో శివపార్వతులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. అనంతరం శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

జలుమూరు: ఆలయ ఆవరణలో సాలిగ్రామ దానాలు చేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి మహారాణి పేరిట తొలిపూజ

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు స్వామివారి చక్రతీర్థ స్నానాలకు భక్తులు పోటెత్తారు. గతేడాది కంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి, ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి మహారాణి కల్యాణి గజపతి వర్మ పేరిట తొలిపూజ నిర్వహించారు. అప్పటికే సిద్ధం చేసిన నంది వాహనంపై ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ వంశధార నదిఒడ్డుకు తీసుకెళ్లారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయించారు. అదనంగా రోప్ పార్టీల వినియోగం, స్వామివారి దర్శనానికి వచ్చేవారిని దక్షిణ ద్వారం నుంచి నేరుగా కరకట్టల మీదుగా బయటకు పంపించడం వల్ల రద్దీని నివారించగలిగారు. డీఎస్పీ డీఎస్ఆర్వీఎస్ఎన్ఆర్ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారి చక్రతీర్థ స్నానాల్లో సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు పైడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం అందించారు. అలాగే తిమడాం, నగిరికటకం, మెట్టపేట యువత, బగ్గు సరోజిని ఆస్పత్రి వర్గాలు భక్తులకు అన్నదానం, మజ్జిగ అందించారు.



పూజలు అందుకుంటున్న స్వామివారు



సారవకోట: మండలాధీశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: ఉమాకామేశ్వర స్వామివారికి చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న దృశ్యం



హిరమండలం: ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



కొత్తూరు: కుంటిభద్రలో చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు

వంచనకు నిలువుటద్దం

- బడ్జెట్‌పై పలువురు విస్మయం

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్నివర్గాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులతో సూపర్ సిక్స్ అమలు సాధ్యం కాదని పేర్కొంటున్నారు. వంచనకు నిలువుటద్దంగా బడ్జెట్‌ను అభివర్ణిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్

కేటాయింపులు దారుణం



బడ్జెట్‌లో కేటాయింపులు దారుణంగా ఉన్నాయి. ఉగాది నుంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణమంటూ ప్రకటనలు చేశారు. కానీ బడ్జెట్‌లో ఆ ఊసులేదు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతోంది. కానీ ఏ ఒక్క హామీ అమలుచేసిన దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రజలు దారుణంగా మోసపోయారు.

– వంగపల్లి సావిత్రి, వైస్ ఎంపీపీ, హిరమండలం

ఇది వంచనే



అధికారంలోకి వచ్చిన మరుక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ బడ్జెట్‌లో దాని ఊసేలేదు. లక్షలాది మంది నిరుద్యోగ యువకులను వంచించారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

– ఏవీ సురేష్, జిల్లా కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

రూ.1500 మాటేదీ?



18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ గురించి ఇప్పుడు పూర్తిగా మరిచిపోయారు. కనీసం బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. అలాంటి హామీ ఇచ్చామన్న విషయాన్ని కూడా మరిచిపోవడం దారుణం. ఇది ముమ్మాటికీ మహిళలను మోసం చేయడమే.

– మీసాల రజిని, ఎంపీటీసీ సభ్యురాలు, హిరమండలం

మొండిచేయి చూపించారు



బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు మొండిచేయి చూపింది. బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉంది. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేకపోవడం దారుణం.

– ఖండాపు గోవిందరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, బూర్జ

ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలి

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల సిబ్బంది ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో ఎల్ఎన్వీ శ్రీధర్ ఆదేశించారు. నరసన్నపేటలో సర్వే తీరును శుక్రవారం ఆయన పరిశీలించి, అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష చేశారు. నరసన్నపేట, ఉర్లాం, మడపాంలలో సర్వే చేయడంతో సిబ్బంది జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ మధుసూదనరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సైన్స్ డే



పొందూరు: తాడివలసలో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న దృశ్యం



ఆమదాలవలస: సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నరసన్నపేట: ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తూరు: మెట్టూరు జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ఉపాధ్యాయులకు సన్మానం



పాతపట్నం: రొంపివలస హైస్కూల్‌లో ప్రాజెక్టుల ప్రదర్శన

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఆవశ్యకతను ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: కేజీబీవీలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు



సరుబుజ్జిలి: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పీహెచ్‌సీ సందర్శన

పోలాకి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ(డీటీఎఫ్) సభ్యులు శుక్రవారం సందర్శించారు. జిల్లా గణాంకాధికారి రామనాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ మురళిలతో కూడిన బృందం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదులపై సిబ్బందిని వివరణ అడిగారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఆశ వర్క్ అప్‌డేట్ రికార్డులపై పలు సూచనలు చేసినట్లు వైద్యాధికారి శ్రీనాథ్ తెలిపారు. ఈవో రవి కుమార్, సిబ్బంది శేఖర్‌బాబు, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో డీటీఎఫ్ టీమ్ సభ్యులు

వాలీబాల్ పోటీల విజేత శంకర్ టీమ్

సారవకోట: మండల కేంద్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని బుడితి గ్రామానికి చెందిన శంకర్ టీమ్ విజేతగా నిలిచింది. ఈ గ్రామం నుంచి రెండు టీములు పాల్గొనగా శంకర్ టీమ్ ప్రథమ, జాయ్ లెవన్ టీమ్ ద్వితీయ బహుమతులు పొందాయి. టెక్కలి టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

నరసన్నపేట: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో దాలినాయుడు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంఆర్ జ్యోతీ ఫ్రెడరిక్, స్కూల్ హెచ్ఎం అల్లాడ రోహిణీ కుమారి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావు, గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆనందరావు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్

సరుబుజ్జిలి: విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐటీడీఏ(సీతంపేట) సీఎంవో చల్ల చిరంజీవి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో చక్కటి ప్రతిభ కనబరిచిన వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు చీమల సాయిశృతి, మండంగి కీర్తన, పత్తిక విజయలకు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు.

చక్రతీర్థాల్లో టీ-షర్టుల వివాదం

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు చేపట్టిన చక్రతీర్థ స్నానాల్లో టీ-షర్టుల వివాదం చోటుచేసుకుంది. స్వామివారిని నంది వాహనంపై వంశధార నదికి చక్రతీర్థ సాన్నాలకు తీసుకెళ్లే సమయంలో కొంతమంది ఆసక్తి కలిగిన యువకులు స్వామివారి వాహనాన్ని మోస్తారు. దీనికోసం ఆలయ అధికారులు, పోలీసులు ముందుగా ఎంపిక చేసిన 70 నుంచి 80 మందికి ప్రత్యేకంగా ముద్రించిన టీ షర్టులు అందజేస్తారు. వీటిని ధరించి రోప్ పార్టీలో ఉండి స్వామివారి వాహనాన్ని మోస్తారు. దీనివలన బయటవారు ఎవరూ రోప్ పార్టీలోకి రాకుండా గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే దేవదాయ శాఖ, పోలీసుశాఖ నిర్లక్ష్యం వలన ఈ ఏడాది టీ-షర్టుల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో ఒకేసారి సుమారు 150 వరకు భక్తులు ఈవో కార్యాలయానికి వచ్చి వాగ్వివాదానికి దిగారు. ఓ వైపు వివాదం జరుగుతుండగా.. వీటితో తనకేం సంబంధం లేదని ఈవో చేతులెత్తేశాడు. అయితే దీనిలో రాజకీయ ప్రమేయం ఉందని యువత ఆరోపిస్తున్నారు. దీనిపై డీఎస్పీ మూర్తి స్పందించి ముందురోజే టీ-షర్ట్స్ పంపిణీ చేయాల్సిందని కిందిస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కొత్త వాటిని పంపిణీ చేయకుండా, గతేడాది టీ-షర్ట్స్‌తో స్వామివారి తిరువీధి చేపట్టారు.



ఈవో కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న యువత